క్లుప్తంగా

సీపీఎం నూతన కమిటీ ఎన్నిక


కె.సత్యనారాయణ

ప్రొద్దుటూరు : సీపీఎం పట్టణ కమిటీని ఎన్నుకున్నట్లు సీపీఎం పట్టణ కార్యదర్శి కె.సత్యనారాయణ తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ గురువారం జరిగిన సీపీఎం పట్టణ మహాసభలో 13 మందితో పట్టణ కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. పట్టణ కమిటీ కార్యదర్శిగా కె.సత్యనారాయణ, కమిటీ సభ్యులుగా పి.పక్కీరయ్య, పి.సుబ్బయ్య, డి.ఓబులేసు, ఎం.రమేష్, యు.రమణయ్య, కె.సర్వేశ్వరి, ఎస్.ముంతాజ్‌బేగం, ఎం.బాబు, రఘు, విజయ్, సైమన్‌లను ఎన్నుకున్నట్లు వివరించారు. పేదలు, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ


పెంచలబాబు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన వైఎస్సార్‌సీపీ 16వ వార్డు బూత్ కన్వీనర్ వనం పెంచలబాబు కుటుంబ సభ్యులను గురువారం ఎమ్మెల్యే డాక్టర్ సుధ పరామర్శించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే పెంచలబాబు మృతి పార్టీకి తీరనిలోటని, పార్టీపరంగా అన్నిరకాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షులు సుందర్‌రామిరెడ్డి, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు గురివిరెడ్డి, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకోవాలి


మాట్లాడుతున్న శివదర్శనానంద సరస్వతి

ప్రొద్దుటూరు కల్చరల్ : ఆధ్యాత్మిక చింతన పెంపొందించుకోవాలని శివదర్శనానంద సరస్వతి మాతాజీ పేర్కొన్నారు. స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలో నామా ఎరుకలయ్య, కమలాక్షమ్మ ఆరాధనోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి ఆమె ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భగవద్గీత చదవడంతె మంచీ, చెడు విచక్షణ జ్ఞానం పెరుగుతుందన్నారు. ఈవో రామచంద్రాచార్యులు, శారద జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సురేష్ బాబు రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి


బీజేపీ సభ్యత్వాన్ని అందజేస్తున్న నాయకులు

బద్వేలు అర్బన్ : గ్రామస్థాయి నుంచి బీజేపీని మరింత బలోపేతం చేయాలని ఆ పార్టీ కడప పార్లమెంట్ కన్వీనర్ బొమ్మనసుబ్బరాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బారెడ్డిలు పేర్కొన్నారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొమ్మనవిజయ్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో చేపట్టిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి పార్టీలో చేరేలా కృషి చేయాలన్నారు. బీరంసుబ్బారెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, గురుశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కూనవారిపల్లెలో పశువైద్య శిబిరం


శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఏడీఏ రమణయ్య

ఖాజీపేట : సీజనల్ వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండి పశువులకు వైద్య చికిత్సు అందించాలని కడప ఉపసంచాలకులు డాక్టర్ రమణయ్య సూచించారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా కూనవారిపల్లె గ్రామంలో పశు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 37 పశువులకు గర్భకోశ చికిత్సలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఖాజీపేట ఉపసంచాలకులు మురళీ, డాక్టర్ రమేష్, రామచంద్ర తోపాటు స్థానిక వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చీటీల వ్యాపారికి ఏడేళ్ల జైలు శిక్ష

ప్రొద్దుటూరు క్రైం: ఐదేళ్ల క్రితం చీటీల పేరుతో మోసం చేసిన వై శ్రీనివాసులరెడ్డికి ప్రొద్దుటూరు కోర్టు జైలు శిక్షతో పాటు జరిమానా విధించింది. వన్‌టౌన్ పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని ఆర్ట్స్ కాలేజీ రోడ్డుకు చెందిన శ్రీనివాసులరెడ్డి చీటీలు నిర్వహించేవాడు. ఈ క్రమంలో 92 మందితో డబ్బు కట్టించుకొని మోసం చేశాడు. ఈ సంఘటనపై వన్‌టౌన్ పోలీసులు 2019లో కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి శ్రీనివాసులరెడ్డికి గురువారం ప్రొద్దుటూరు ప్రిన్స్‌పల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్ ప్రవీణ్‌కుమార్ ఏడేళ్ల జైలు శిక్ష, రూ.18000 జరిమానా విధించారు.

విస్తారంగా పొగాకు సాగు

- క్వింటా ధర రూ.15 వేలు
- ధర ఉండటంతో పెరిగిన సాగు విస్తీర్ణం


మామిళ్ళపల్లె వద్ద సాగుచేసిన పొగాకు పంట

కలసపాడు : బద్వేలు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో రైతులు విస్తారంగా పొగాకు సాగు చేశారు. ఈ ఏడాది పొగాకు సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. ఏళ్లుగా సాగుచేస్తున్న సంప్రదాయ పంటలకు రైతులు స్వస్తి చెబుతున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వస్తుందనే ఆశతో పొగాకు సాగుకు మొగ్గుచూపుతున్నారు. తీవ్ర కరువుతో పంటలకు నీరు అందుతుందన్న నమ్మకం లేక రైతులు తక్కువ నీటితో సాగయ్యే పొగాకు వైపు ఆసక్తి చూపుతున్నారు. మూడేళ్ల క్రితం నియోజకవర్గంలో పత్తి, కంది, పొద్దుతిరుగుడు పంటలను విస్తృతంగా సాగు చేసేవారు. అయితే పైరు పూత, కాయ దశలో ఉన్నప్పుడు తీవ్ర వర్షాభావంతో పంటలు మధ్యలోనే ఎండుముఖం పట్టి దిగుబడి గణనీయంగా తగ్గుతుంది. దీంతో రైతులు నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో కలసపాడు మండలంలో కొంతమంది రైతులు పొగాకు సాగు చేపట్టారు. గత రెండు, మూడేళ్లుగా ఈ పైరు రైతులకు లాభాలు తెచ్చి పెట్టింది. దీంతో సదరు రైతులు తమ అనుభవాలను మిగిలిన రైతులకు చెప్పడంతో మిగిలిన వారు పొగాకు సాగుకు సిద్ధపడుతున్నారు. పొగాకుకు కంపెనీలు కూడా మార్కెట్‌కు తగ్గట్టుగా క్వింటాకు రూ.15 వేల నుంచి రూ.18 వేల వరకు స్థానికంగానే కొనుగోలు చేస్తున్నారు. ఇటు రైతులతో పాటు రైతు కూలీలకు మంచి కూలీ లభిస్తుండటంతో రైతులు పొగాకు సాగుకు ఆసక్తి చూపుతున్నారు. నియోజకవర్గంలో ఈ ఏడాది 2,500 హెక్టార్లకు పైగా పొగాకు సాగైనట్లు అంచనా.

మక్కువ చూపుతున్న రైతులు

నియోజకవర్గంలో 8 సంవత్సరాల క్రితం పొగాకు సాగు చాలా తక్కువ. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పొగాకుకు మద్దతు ధర ఇచ్చి రైతుల పొలాల వద్దనే కొనుగోలు చేయడంతో రైతులు పొగాకుపై మక్కువ చూపుతున్నారు. ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఎకరా పొగాకు పంటను సాగు చేయడానికి రూ.50 వేల నుంచి రూ.60 వేలు ఖర్చవుతుంది. క్వింటా రూ.15 వేల నుంచి రూ.18 వేలు పలుకుతుండటంతో ఎకరాకు పది క్వింటాళ్ల దిగుబడి వచ్చినా రూ.1.50 లక్షల నుంచి రూ.1.80 లక్షల వరకు వస్తుంది. ఖర్చులు పోను రూ.లక్ష నుంచి రూ.1.30 లక్షల వరకు ఆదాయం వస్తుందని రైతులు చెబుతున్నారు.


ఎండబెట్టిన పొగాకు

5 ఎకరాల్లో సాగు చేశా



ఐదు ఎకరాల పొలంలో పొగాకు పంటను సాగు చేశాను. ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. ధర మంచిగా ఉండటంతో ఈ ఏడాది ఐదు ఎకరాల్లో సాగు చేశాను. గతేడాది క్వింటాలు రూ.15 వేలు పలికింది. ఈ ఏడాది పంట బాగుంది. దిగుబడి కూడా బాగానే వస్తుందని ఆశిస్తున్నా.

జి.వెంకటరెడ్డి, రైతు, ఎగువ తంబళ్లపల్లె, కలసపాడు మండలం

ఈ ఏడాది పంట బాగుంది



మూడు ఎకరాల్లో పొగాకు పంట సాగు చేశాను. గ్రామంలో రైతులను చూసి మొదటిసారి పొగాకు పంటను సాగు చేశాను. ఏ ఏడాది కూడా వర్షాలు అనుకూలించడంతో పంట బాగా ఉంది. గతేడాది మాదిరిగానే ధర పలికితే మంచి లాభాలు వస్తాయని అనుకుంటున్నాను.

వై.అనిల్‌రెడ్డి, రైతు, ఎగువ రామాపురం, కలసపాడు మండలం

అన్యాయమని ప్రశ్నిస్తే.. చంపుతానంటున్నాడు

కానిస్టేబుల్ వ్యవహారంపై కంటతడి పెట్టిన రైతు దంపతులు


సీజ్ చేసిన బోరు వద్ద ఓబయ్య, ప్రక్కనే కానిస్టేబుల్ శ్రీను సాగు చేసిన వరి

పోరుమామిళ్ల : వాల్టా చట్టం గురించి తెలిసిన కానిస్టేబుల్.. అడ్డుకోవాల్సిన అధికారులు కిమ్మనకపోవడంతో ఓ రైతు కంటతడి పెట్టాల్సి వచ్చింది. రామేశ్వరం గ్రామానికి చెందిన రైతు దంపతులు కాడే పెద్ద ఓబయ్య, మహాలక్షుమ్మ వివరాల మేరకు.. పెద్ద ఓబయ్యకు రామేశ్వరం వద్ద సర్వే నెంబర్ 205/3లో 4.80 ఎకరాల పొలముంది. బోరు వేసుకుని పంట సాగు చేసుకుంటున్నారు. ఆయన సమీప బంధువు కానిస్టేబుల్ గౌర శ్రీను(ప్రక్క పొలం) ఇటీవల ఈయన బోరుకు ఐదు అడుగుల దూరంలో మరో బోరు వేసుకున్నాడు. దీంతో ఓబయ్య బోరులో నీరు అడుగంటిపోయింది. మరో నాలుగు సార్లు బోర్లు వేసినా నీరు రాకపోవడంతో కన్నీటి పర్యంతమవుతూ ఓబయ్య రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాడు. తహసీల్దారు విచారించి ఇరువురి బోర్లను సీజ్ చేశారు. అయితే ఇప్పుడు శ్రీను వరి, మొక్క జొన్న సాగు చేస్తున్నారు. తమకు నీరు లేకుండా చేయడం అన్యాయం కాదా అంటూ శ్రీనును ప్రశ్నిస్తే తనపై దాడికి దిగుతున్నాడని, చంపుతానని బెదిరిస్తున్నాడని ఓబయ్య కన్నీరు పెట్టుకుంటున్నాడు. తహసీల్దారుకు ఫిర్యాదు చేస్తే మేము రెండూ సీజ్ చేశాం కదా? మీ పొలాలకు మేము కావలి ఉండలేం అంటూ చెబుతున్నారని వాపోయారు. వాల్టాను అతిక్రమించి, దాడికి దిగుతున్న శ్రీనుపై చర్య తీసుకోవాలని ఓబయ్య దంపతులు కోరారు.

పేదలపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి


తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

బద్వేలు అర్బన్ : సి.కొత్తపల్లె పొలంలో గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్న పేదలపై రెవెన్యూ అధికారులు కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర పేర్కొన్నారు. సి.కొత్తపల్లె గుడిసె వాసులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లు లేని నిరుపేదలు గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తుంటే రెవెన్యూ అధికారులు మౌలిక వసతులు కల్పించకపోగా పేదలు స్వయంగా ఏర్పాటు చేసుకున్న విద్యుత్ సౌకర్యాన్ని తొలగించి వారిని ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. కోట్లాది రూపాయల విలువైన స్థలాలు కబ్జా అయినప్పటికీ వాటిని పట్టించుకోని రెవెన్యూ అధికారులు పేదల గుడిసెలపై ఉక్కుపాదం మోపడం సరికాదని హితవుపలికారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్, పట్టణ కార్యదర్శి బాలు, ఏరియా కార్యవర్గ సభ్యులు పెంచలయ్య, ఇమ్మానియేల్, పట్టణ నాయకులు నాగ సుబ్బారెడ్డి, సుబ్బారెడ్డి, మధు, ఏఐవైఎఫ్ నాయకులు మల్లేష్, నవీన్ పాల్గొన్నారు.

గ్రూప్–2 మెయిన్స్ పరీక్షలను వాయిదా వేయాలి


మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్

ప్రొద్దుటూరు : గ్రూప్–2 మెయిన్స్ పరీక్షలను రెండు నెలలపాటు వాయిదా వేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ కోరారు. ప్రొద్దుటూరులో గురువారం ఆయన మాట్లాడుతూ 899 గ్రూప్–2 పోస్టులకు ఈ ఏడాది ఫిబ్రవరి 25న ప్రిలిమ్స్ పరీక్షలు నిర్వహించి, ఏప్రిల్ 10న ఫలితాలు ప్రకటించారన్నారు. జూలై 28న పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా ఏపీపీఎస్సీ చైర్మన్ లేకపోవడంతో వాయిదా వేశారన్నారు. ఇప్పుడు ఉన్నఫలంగా ఏపీపీఎస్సీ జనవరి 5వ తేదీ నుంచి మెయిన్స్ పరీక్షలు నిర్వహిస్తామని ప్రకటించడంతో గ్రామీణ ప్రాంత అభ్యర్థులకు నష్టం జరుగుతుందన్నారు. డిసెంబర్ చివరి వారంలో పోలీస్ కానిస్టేబుల్ ఈవెంట్స్, రైల్వే పరీక్షలు ఉన్నాయన్నారు. గ్రూప్–2 సిలబస్‌ను దృష్టిలో ఉంచుకుని ఏపీపీఎస్సీ చైర్మన్ పునరాలోచించి మెయిన్స్ పరీక్షలను వాయిదా వేసి ఎలాంటి వివాదాలు లేకుండా ఫిబ్రవరిలో నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్ రాజ్, వెంకటేష్ పాల్గొన్నారు.

సీబీఐటీలో ‘విద్వాంత్ టెక్ ఉత్సవ్’


మాట్లాడుతున్న సీబీఐటీ డైరెక్టర్ లోహిత్‌రెడ్డి

చాపాడు : బీటెక్ చదువుతున్న విద్యార్థుల్లో నూతన ఉత్సాహం కలగాలని చదువుతోపాటు స్కిల్ డెవలప్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీబీఐటీ డైరెక్టర్ లోహిత్‌రెడ్డి అన్నారు. స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ)కాలేజీలో గురువారం విద్వాంత్ టెక్ ఉత్సవ్ – 2కె24 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో పేపర్ ప్రజంటేషన్స్, టెక్నికల్ క్విజ్, కోడింగ్ కా టెస్ట్, వెబ్ డిజైనింగ్, టెక్నికల్ ఈవెంట్ ఆర్ట్ కాన్ టెస్ట్, ఈ స్పోర్ట్స్ వంటి నాన్ టెక్నికల్ ఈవెంట్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డైరెక్టర్ మాట్లాడుతూ సాంకేతిక విద్యలో రోజురోజుకు మారుతున్న కాలానుగుణంగా విద్యార్థులు ముందుకెళ్లాలన్నారు. చదువుతోపాటు స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకుంటే భవిష్యత్తులో ఉన్నత స్థితికి చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో డా.జి.శ్రీనివాసులరెడ్డి, డా.ఎస్.శృతి, డా.బి.రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం మాఫియాను అడ్డుకోవడంలో విఫలం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరులో రేషన్ బియ్యం మాఫియాను అడ్డుకోవడంలో రెవెన్యూ అధికారులు విఫలమయ్యారని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ములపాకు ప్రతాప్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వైఎంఆర్ కాలనీలో రేషన్ బియ్యం వ్యవహారంపై పత్రికల్లో కథనాలు వచ్చినా రెవెన్యూ అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. తహసీల్దార్, జమ్మలమడుగు ఆర్డీఓ రేషన్ బియ్యం మాఫియాపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జూదరుల అరెస్ట్

పోరుమామిళ్ల : టేకూరు గ్రామ సమీపంలో గాజా బావి దగ్గర గురువారం పేకాట ఆడుతుండగా నలుగురు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. వారి నుంచి రూ. 11 వేలు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేశామని ఎస్ఐ చెప్పారు.

10న గండి కోట చిత్రలేఖన పోటీలు

ప్రొద్దుటూరు : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఈ నెల 10న ఉదయం 10 గంటలకు గండికోట చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్లు బాలోత్సవ కమిటీ అధ్యక్షుడు జి.గోపాల్, కార్యదర్శి బి.లక్ష్మీరాజా ఓ ప్రకటనలో తెలిపారు. 6, 7వ తరగతుల విద్యార్థులకు ఒక విభాగం, 8, 9, 10 తరగతుల విద్యార్థులు మరో విభాగంగా చిత్రలేఖన పోటీలు ఉంటాయన్నారు. ప్రతిభ చూపిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల తోపాటు ఐదు మందికి కన్సొలేషన్ బహుమతులను అదే రోజు 1.30 గంటలకు ఇస్తామని వివరించారు. సెల్ నంబర్లు 9291463437, 9182830722 సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు వాడితే చర్యలు


స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ కవర్లతో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీలో నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను విక్రయించినా, వాడినా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. స్థానిక శివాలయం వీధి, కోనేటి కాలువ వీధిలో, పలు ప్రాంతాల్లో శానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై గురువారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో దాదాపు 150 కిలోల నిషేధిత ప్లాస్టిక్ కవర్లు సీజ్ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ వ్యాపారులు ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లు అమ్మకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.గోవిందరెడ్డి, నూర్‌బాషా, వంకం సుబ్బరాయుడు, సునీత పాల్గొన్నారు.

తోపుడుబండ్ల వ్యాపారులకు కౌన్సెలింగ్


తోపుడుబండ్ల వ్యాపారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ. ఎస్ఐ

పోరుమామిళ్ల : తోపుడుబండ్లపై వ్యాపారం చేసుకొనేవారు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డి హెచ్చరించారు. గురువారం పట్టణంలోని పండ్ల వ్యాపారులు, కూరగాయల వ్యాపారులు, తోపుడు బండ్లపై వ్యాపారం చేసుకొనే వారికి పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. పట్టణంలో ట్రాఫిక్ ఎక్కువగా ఉన్నందున తోపుడుబండ్లను ఒకే చోట పెట్టుకోవాలని సూచించారు. మద్యం సేవించి వ్యాపారం చేయకూడదని పేర్కొన్నారు.

ఐడెంటీ కార్డుల పంపిణీ

ఏఐటీయూసీ అనుబంధసంస్థ తోపుడుబండ్ల వర్కర్స్ యూనియన్ సభ్యులకు సీఐ ఐడెంటీ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల అధ్యక్ష కార్యదర్శులు పేరయ్య, సఫా, యూనియన్ నాయకులు రఫీ, ఆంజనేయులు, మహబూబ్‌బాషా, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాలకు ఎన్‌పీసీఐ లింక్ చేసుకోండి

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలంటే తప్పనిసరిగా బ్యాంకు ఖాతాలకు ఎన్‌పీసీఐ లింక్ చేసుకోవాలని ప్రొద్దుటూరు ప్రధాన తపాలా కార్యాలయం సూపరింటెండెంట్ కిరణ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్‌పీసీఐ లింక్ కాని వారి జాబితాను సచివాలయాలకు పంపారని, సంక్షేమ పథకాల నగదు అకౌంట్లలో పొందడానికి ఆధార్ సీడింగ్ తప్పనిసరి అని ఆయన పేర్కొన్నారు. సుమారు 65 లక్షల మందికి ఎన్‌పీసీఐ మ్యాపర్‌లో ఆధార్ సీడింగ్ లేకపోవడంతో వారికి సంక్షేమ ఫలాలు అందడం లేదని తెలిపారు. తమ సచివాలయ పరిధిలోని పోస్టాఫీసులో సంప్రదించాలని కోరారు.

10న ఉచిత డీఎస్సీ శిక్షణకు స్క్రీనింగ్ పరీక్ష

ప్రొద్దుటూరు : సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత డీఎస్సీ శిక్షణ కోసం ఈ నెల 10న ఉదయం 10.30 గంటల నుంచి 1.30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారిత అధికారి, ఉపసంచాలకులు కె.సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు http://www.jnanabhumi.ap.gov.in వెబ్‌సైట్ నుండి హాల్ టికెట్స్ డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు. అభ్యర్థులు 2 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్, ఓటర్ కార్డు, ఇతర ఏదైనా గుర్తింపు పత్రాలతో ఉదయం 9 గంటలకు పరీక్ష కేంద్రంలో హాజరు కావాలని కోరారు.

ముందస్తు పరీక్షలతో క్యాన్సర్ గుర్తింపు


శ్రీరాములపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది


ఖాజీపేట: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధికారులు


చాపాడు: ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం: ముందస్తు పరీక్షలతో క్యాన్సర్‌ను గుర్తించవచ్చని డాక్టర్ భరత్‌నారాయణ తెలిపారు. జాతీయ క్యాన్సర్ అవగాహనా దినం సందర్భంగా మండలంలోని పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లలో గురువారం ర్యాలీ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీరాములపేట అర్బన్ హెల్త్ సెంటర్‌లో నిర్వహించిన క్యాన్సర్ అవగాహన కార్యక్రమంలో డాక్టర్ మాట్లాడుతూ త్వరలో ఇళ్ల వద్దే 18 ఏళ్లు దాటిన ప్రతి పౌరుడికి ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. నిర్లక్ష్యం చేయకుండా వైద్య సిబ్బందికి సహకరించి పరీక్షలు చేయించుకోవాలన్నారు. నోట్లో మానని పుండ్లు, నాలుక కింద గడ్డలు, రొమ్ములో గడ్డలు, రొమ్ము నొప్పి, అసాధారణ రక్తస్రావం, తదితర క్యాన్సర్ లక్షణాలని డాక్టర్ తెలిపారు. గతంలో ఎవరికైనా క్యాన్సర్ ఉంటే తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎంఆర్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్‌లో

పట్టణంలోని వైఎంఆర్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్‌లో నిర్వహించిన క్యాన్సర్ అవగాహన కార్యక్రమంలో డాక్టర్ నల్లబల్లి హిమబిందు మాట్లాడుతూ క్యాన్సర్ గుర్తింపు విజయం స్క్రీనింగ్‌తో సాధ్యమని చెప్పారు. స్త్రీలలో గర్భాశయ, రొమ్ము క్యాన్సర్, మగవారిలో నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్ వస్తాయన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఓ ఎంవీ సుబ్బారెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

శ్రీనివాసనగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో

స్థానిక శ్రీనివాస నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ చంద్రశేఖర్ క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. క్యాన్సర్ లక్షణాలు, క్యాన్సర్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి డాక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శోభారాణి, సీఓ నాగజ్యోతి, స్టాఫ్‌నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

కామనూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో

కామనూరు పీహెచ్‌సీలో ర్యాలీ నిర్వహించారు. ముందస్తు పరీక్షల ద్వారా క్యాన్సర్‌ను తెలుసుకోవచ్చని డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఇంటి వద్దనే క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను చేయించుకోవాలన్నారు. క్యాన్సర్ గురించి తెలుసుకొని జాగ్రత్తలను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ కృష్ణమ్మ, సూపర్‌వైజర్ బీపీ వరప్రసాద్, చంద్రకళ,శ్రీధర్, మధు, ప్రసాద్ పాల్గొన్నారు.

క్యాన్సర్ రహిత సమాజానికి పాటుపడదాం

ఖాజీపేట : మన ఆహార అలవాట్లతోపాటు ఆరోగ్యకరమైన జాగ్రత్తలు పాటిస్తే క్యాన్సర్ లాంటి వ్యాధులు రాకుండా కొంతమేరకు నివారించవచ్చునని మైదుకూరు సామాజిక కేంద్రం గైనకాలజిస్ట్ డాక్టర్ లలిత సూచించారు. ఖాజీపేటలోని కస్తూర్బా పాఠశాలలో క్యాన్సర్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను, అవి వచ్చిన తరువాత మనకు కలిగే నష్టాలను విద్యార్థులకు ఆమె వివరించారు. కణజాలాలు, అవయవాలు ఏర్పడటానికి ట్రిలియన్ల కొద్ది కణాలను ఒక సముదాయంగా ఏర్పడి అవయవాలుగా ఏర్పడతాయన్నారు. పాత కణాల స్థానంలో కొత్త కణాలు వస్తుంటాయని చెప్పారు. ఈ క్రమంలో క్షీణించవలసిన సమయంలో కొన్ని కణాలు క్షీణించవని అవి శరీరంలో గడ్డలుగా ఏర్పడతాయని అన్నారు. వాటి వల్ల మనకు క్యాన్సర్ వస్తుందని చెప్పారు. వాటిని సకాలంలో గుర్తించి చికిత్సలు చేయించుకుంటే ఎలాంటి సమస్యలు లేకుండా పూర్తిగా నయం అవుతుందని తెలిపారు. క్యాన్సర్ నివారణకు నేడు అత్యాధునిక సేవలు అందుబాటులోకి వచ్చాయని తెలియజేశారు. కార్యక్రమంలో ఖాజీపేట వైద్యాధికారులు డాక్టర్ ముబిన్, అయేషా, ఆరోగ్య విస్తరణ అధికారి నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కలిగి ఉండాలి

చాపాడు : క్యాన్సర్ వ్యాధి వ్యాప్తి, దాని నివారణపై ప్రజలకు అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారులు కావ్య మాధురి, శ్రీవాణి, ఓబులేసు అన్నారు. క్యాన్సర్ వ్యాధిపై అవగాహన దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రమైన చాపాడు పీహెచ్‌సీ, నక్కలదిన్నె పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇదే క్రమంలో ఖాదర్‌పల్లె గ్రామంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో వైద్యాధికారులు క్యాన్సర్ వ్యాధిపై మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించడం, వ్యాధి లక్షణాలను గుర్తించడం, సమర్థవంతమైన చికిత్సా విధానాల గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. క్యాన్సర్ లక్షణాలు వివరించారు. ప్రతి ఒక్కరూ స్క్రీనింగ్ చేయించుకునేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి రాఘవయ్య, సూపర్‌వైజర్‌లు సరస్వతి, బాబురెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

క్యాన్సర్ నివారణపై ర్యాలీ

బద్వేలు అర్బన్ : అవగాహనతోనే క్యాన్సర్‌ను నివారించవచ్చునని తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జె.వినయ్‌కుమార్ పేర్కొన్నారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవంలో భాగంగా గురువారం పట్టణంలో క్యాన్సర్‌పై విజయం – స్క్రీనింగ్‌తోనే సాధ్యం అనే నినాదంతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిని అరికట్టాలంటే ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు నిరంతరంగా వైద్యపరీక్షలు చేయించాలని, అందులో భాగంగానే ఈ నెల 14 నుంచి ఇంటింటికి వెళ్లి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 18 సంవత్సరాలు దాటిన ప్రతిఒక్కరు పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్ సౌమ్య, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ శరత్‌చంద్ర, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, శివరామిరెడ్డి పాల్గొన్నారు.

ర్యాలీ

బి.కోడూరు : బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా గురువారం పీహెచ్‌సీ సిబ్బందితో సమావేశం నిర్వహించి అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు, డాక్టర్ ఉదయ్‌కిరణ్‌లు మాట్లాడుతూ క్యాన్సర్ పట్ల అవగాహన కల్పించాలన్నారు. ముందస్తు పరీక్ష చేయించుకుంటే క్యాన్సర్ నుంచి బయటపడవచ్చని, సిగరెట్, పొగ, పొగాకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నాగమణి, హెల్త్ అసిస్టెంట్ రామతీర్థం, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.